అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 16 సెప్టెంబర్ 2025 పేజీలు : 04





# గ్రీవెన్స్ సెల్‌కు పలువురు అధికారుల డుమ్మా..!

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- నిర్లక్ష్యం వీడని అధికారులు



పిజిఆర్ఎస్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

**గుంతకల్లు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. ప్రతి సోమవారం కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే పలువురు అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడడం లేదు. రెవెన్యూ, విద్య, వ్యవసాయం, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, సోషల్ వెల్ఫేర్ తదితర 20కి పైగా శాఖల అధికారులు హాజరు కావాల్సి వుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నాం 1 గంట వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో వుండాలి. తహాశీల్దార్ రమాదేవి, విద్యుత్ ఏఈ, మండల విద్యాశాఖ అధికారి, ఐసిడిఎస్, హౌసింగ్, ఆర్‌అండ్‌బి శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే సమయానికి హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు మాత్రం సమయపాలనను పట్టించుకోలేదు. మండల వ్యవసాయ అధికారిని డి.లీనా వసుంధర, నీటిపారుదల శాఖ అధికారులతో పాటు మరో నాలుగు శాఖలకు సంబంధించిన అధికారులు 11.30 గంటలకు హాజరు కావడం వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ప్రజలు కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగకుండా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేసింది. అయితే కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ప్రజా సమస్యల పట్ల అధికారులు ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నారోనని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదిలా వుండగా సగానికి పైగా అధికారులు పిజిఆర్ఎస్‌కు డుమ్మా కొట్టడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు సమయపాలన పాటించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్‌కు 121 పిటీషన్లు

- జాప్యం లేకుండా చట్టపరిధిలో పరిష్కారం చూపాలన్న జిల్లా ఎస్పీ పి.జగదీష్



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ

**అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేదింపులు, రస్తా తగాదాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందజేసిన పిటీషనర్ల ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, చట్టపరిదిలో సత్వర న్యాయం అందించాలి. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని జిల్లా ఎస్పీ పి జగదీష్ సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ తో పాటు డీసీఆర్బీ సి.ఐ హరినాథ్ పాల్గొన్నారు.

## పిటీషన్లు పునరావతం కాకుండా బాధితులకు న్యాయం చేయండి

- శ్రీ సతసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్




ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ద్వారా ప్రజల నుండి వచ్చిన పిడిషన్లు పునరావృతం కాకుండా సత్వరమే బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పి ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ గారు మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, భూ తగాదాలు, సైబర్ మోసాలు, వ్యాపారల పేరుతో మోసాలు , తదితర వంటి సమస్యలపై ఈ రోజు మొత్తం 60, ఫిర్యాదులు అందజేశారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు , పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, మహిళా పిఎస్ స్టేషన్ డిఎస్పి ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

# అనంతలో ఆగ్రహ జ్వాలలు

ఆర్డిటి కోసం వేల సంఖ్యలో అనంత వీధుల్లో రంకేశారు

- ❖ ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ ఇవ్వాలని కలెక్టరేట్‌ను ముట్టడించారు
- ❖ ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి భారీగా కదలివచ్చిన లబ్దిదారులు
- ❖ పోలీసులు అడ్డగించినా వాహనాలను వెనక్కి తిప్పలేదు
- ❖ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన
- ❖ సీఎం చంద్రబాబు అనుకుంటే పని అవుతుందని నేతల వెల్లడి










**అనంతపురం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా కేంద్రంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)కి ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయకుండా కేంద్రం హోంశాఖ మొండికేసిందనే ఆక్రోశంతో వేల సంఖ్యలో లబ్దిదారులు సోమవారం అనంతపురంకి తరలివచ్చారు. చిన్నా, పెద్ద, ముసలి, ముతక అన్న తేడా లేకుండా ఆర్డిటి లబ్దిదారులు పెద్దఎత్తున చీమ పుట్టల్లా కదలి వచ్చి అనంతపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. సేవ్ ఆర్డిటి పేరుతో ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, పాల్గొనడం ఒక ఎత్తైతే, పిడికలు బిగించి ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతులను ఇవ్వాల్సిందే అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్, అక్కడక్కడ తరలివచ్చిన వాహనాలను పోలీసులు అడ్డుకునేందుకు యత్నించగా లబ్దిదారులు ప్రతిఘటించడంతో చేసేది లేక పోలీసులు చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. జెఏసి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదిన కూడా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేశారు. రెండవ విడుతగా సోమవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో ఆర్డిటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం పొందిన లబ్దిదారులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న కాలేజీ గ్రౌండ్‌లోకి లబ్దిదారులంతా చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు చేరుకున్నారు. ర్యాలీలో పెద్ద ఎత్తున కళాకారులు కూడా డప్పులు వాయిస్తూ తప్పెట్లు కొడుతూ, ఉరుములు వాయిస్తూ ఆందోళన కారులను ఉత్సాహ పరిచారు. గొరవయ్యలు కూడా పాల్గొన్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో కలెక్టరేట్ వద్దకు చేరుకుని గంటల తరబడి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ విగ్రహం వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేసి కలెక్టరేట్ కార్యాలయంకు చేరుకున్నారు. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించే విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుకుంటే పని అవుతుందని ఎన్డీఏ ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకొచ్చి ఆర్డిటి ప్రజలకు సేవ చేసే విధంగా తోడ్పడాలని జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాలోనే కాకుండా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో వెనుకబడిన జిల్లాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్న ఆర్డిటిని రక్షించుకుంటామని పలు ప్రజా సంఘాలు, ఎస్సీ, ఎస్టీ బిసి సంఘాల నాయకులు వెల్లడించారు. ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ నిలుపుదల చేయడంతో భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోతాయని, ఆర్డిటి సంస్థ ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా స్పందించడం లేదని, పరిస్థితి ఇలాగె కొనసాగితే ఆందోళనలు ఉదృతం చేయాల్సి వస్తుందని, జెఏసి నాయకులు హెచ్చరించారు. ఆర్డిటి సంస్థను విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించగా ఆ సంస్థ దశల వారీగా విస్తరించి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఆర్డిటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాలకు ఎంతో న్యాయం జరిగిందని జేఏసి నాయకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ఆణిముత్యాలను తయారు చేసేందుకు ఆర్డిటి ఎంతో కృషి చేస్తోందని, అనంతపురంలో క్రికెట్ స్టేడియం నిర్మించడంతో దేశ, విదేశాల నుంచి శిక్షకులను రప్పించి ఫుట్‌బాల్, వాలీబాల్, హాకీ తదితర క్రీడల్లో శిక్షణ ఇస్తోందని దేశంలో ఇతర రాష్ట్రాల క్రీడాకారులతో పోటీ పడే విధంగా ఆర్డిటి చర్యలు తీసుకుంటోందన్నారు. వైద్య రంగంలో బత్తలపల్లి, కళ్యాణదుర్గం తదితర ఆసుపత్రుల వల్ల ఎంతో న్యాయం జరుగుతోందని, ఈ విధంగా విద్య, వైద్య, వ్యవసాయం, మహిళల అభివృద్ధి తదితర వాటిలో ఆర్డిటి కీలకంగా వ్యవహరిస్తోందని రాబోయే రోజుల్లో ఆర్డిటి సేవలు వెనుకబడిన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు అందాలంటే ఎఫ్‌సిఆర్‌ఏ అనుమతి తప్పదని నేతలు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా జోక్యం చేసుకుని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లాలని, సీఎం అనుకుంటే క్షణాల్లో సమస్య పరిష్కారం అవుతుందని జెఏసి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులు పెద్ద ఎత్తున వేల సంఖ్యలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో దళిత సంఘాలు, పలు ప్రజా సంఘాల నేతలు ఈ నిరసన కార్యక్రమానికి నాయకత్వం వహించినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిఎస్ రాష్ట్ర నాయకులు బిసిఆర్ దాస్ మాదిగ, చిర్రోల రామాంజినేయులు, మురళీ, నాగభూషణం, కంబదూరు జడ్పిటిసి నాగరాజు, గంగులప్ప, అక్కులప్ప, సాయిరామ్, శంకర్, రామాంజినమ్మ, మధు, శాంతమ్మ తదితర నాయకులు పాల్గొన్నారు. గత కొద్దిరోజులుగా ఆర్డిటి కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహించిన న్యాయవాదుల జెఏసి నాయకులు కూడా ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు పలికారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను పంపి పరిష్కారం కోసం కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అధికారులు హామీ ఇవ్వడంతో సేవ్ ఆర్డిటి జేఏసి నాయకులు తమ నిరసన కార్యక్రమాన్ని విరమించారు.

# వెలుగు సిబ్బంది లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..!

- నకిలీ సంతకాలతో తీర్మానాలు...! సున్నా వడ్డీ రుణాలసొమ్ము స్వాహా ! - నకిలీ సంఘాలతో యానిమేటర్ వేతనం స్వాహా...?

**చెన్నేకొత్తపల్లి (ధర్మవరం) సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**

రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించడం కోసం ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి అనేక పథకాల ద్వారా మహిళా సంఘాలకు నిధులు మంజూరు చేసింది . వివిధ రంగాల్లో ఉపాధి పొందడం కోసం తక్కువ వడ్డీకే రుణాలను , దళితులైన ఎస్సీ,ఎస్టీ లకు సున్న వడ్డీకే రుణాలను అందజేస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. అయితే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాలను నీరు కారుస్తూ వారి స్వలాభం కోసం ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ సబ్సిడీ రుణాలు, సున్నా వడ్డీ రుణాలను మహిళా సంఘాల సభ్యులకు కూడా తెలియకుండా తమ సొంతానికి స్వాహా చేస్తున్నారు. అదీ చాలదన్నట్టు తమకు అనుకూలంగా ఉన్న యానిమేటర్లకు వారు అడిగిన రుణాలు నిబంధనలకు విరుద్ధంగా లోను తీసుకుని బ్యాంకుకు కంతులు చెల్లించాల్సి ఉండగా తిరిగి రెండవసారి రుణాలు కూడా వెలుగు సిబ్బంది మంజూరు చేయించి తమ ఉడత భక్తిని చాటుకున్నారు. క్షేత్రస్థాయిలో వెలుగు సిబ్బంది మొరుగు లీలలు విచారించి వెలుగులోకి తెస్తే భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు వెలుగులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారానికి సంబంధించి ఉదాహరణగా ఓ ఘటన వెలుగులోకి.... శ్రీ సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల పరిధిలో క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతి, నిర్లక్ష్యంతో డ్వాక్రా సంఘాల సొమ్ము భారీగా పక్కదారి పడుతోంది. డ్వాక్రా మహిళ సంఘాలను బలోపేతం చేయడానికి నియమించిన సిబ్బందే సొమ్మును సొంత వ్యవహారాలకు వాడుకుంటున్నారు. స్వాహా చేసిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేయకుండా చీటిలు, ప్రైవేట్ ఫైనాన్సుల్లో పెట్టుబడులు పెట్టి అధిక లాభాలతో కోట్లకు పడగలెత్తుతున్నారు. గ్రామాలలో చాలా మంది మహిళలు నిరక్షరాస్యులు కావడం, బ్యాంక్ లావాదేవిలపై అవగాహన లేకపోవడంతో బ్యాంకు సిబ్బందిని మ్యానేజ్ చేసి వెలుగు శాఖ సీ సీ లు నకిలీ తీర్మానాలు, నకిలీ సంతకాలతో రుణాలు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. మహిళా సంఘాలు రుణాల చెల్లించినప్పటికీ పాత తీర్మానాలు, నకిలీ సంతకాలతో మళ్ళీ లోన్లు మంజూరు చేసుకుని వెలుగు సిబ్బంది జేబులు నింపుకుంటున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో చాలా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గత ఆరు నెలల క్రితం చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని మేడాపురం పంచాయితీ లో స్త్రీ నిధి రుణాలు మంజూరు లో గోల్మాల్ జరిగిందని, అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ లకు వడ్డీ లేని "ఉన్నతి " రుణాలకి కూడా వడ్డీ వసూలు చేయడం జరిగిందని మేడాపురం గ్రామ మహిళలు జిల్లా డి.ఆర్.డి. ఏ. పిడి కి పిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన మొదటి రెండు రోజుల్లో విచారణ చేయించినట్టు హంగామా చేసి సుమారు పదిమంది లబ్ధిదారులతో తమ సిబ్బంది వసూలు చేసిన వడ్డీ సొమ్మును వెనక్కి అందజేశారు. తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ విచారణ మరుగున పడిపోయింది. గ్రామస్తులు అంతా డీ ఆర్డీ ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్యను తమకు న్యాయం చేశారని ఆకాశానికి ఎత్తి పొగడ్తలతో ముంచేత్తారు. అయితే విచారణ మధ్యలోనే ఆగిపోవడంతో పొగిడిన గ్రామస్తులే విమర్శలు గుప్పించారు. ఇలా అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతా అధికారులు విఫలమయవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ వెలుగు సిబ్బంది అవినీతి అక్రమాలు ఆగలేదు. ఓవైపు గ్రామస్తులు ఫిర్యాదుతో విచారణ జరిగినా... కుక్క తోక వంకర అన్న చందంగా సదరూ సీసీ కనకదుర్గ సంఘంలో అంతర్గత అప్పు పేరుతో సంఘాల సభ్యులు నకిలీ సంతకాలతో (వేలి ముద్రలు వేసి) సుమారు 30వేలు కాజేయడంతో జిల్లా ఉన్నతాధికారుల పనితీరు పై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని మేడాపురం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత డ్వాక్రా సంఘాల సభ్యులు కంచె చేను మేసింది అన్న చందంగా ఎక్కడా తప్పు జరగకుండా పర్యవేక్షించాల్సిన వెలుగు అధికారి తప్పు చేస్తే ఎవరికి చెప్పుకోవాలని ఆయోమయంలో గ్రామస్తులు ఉన్నారు.

### తప్పు మీద తప్పు చేసినా ఆ సీ.సీ పై చర్యలు శూన్యం..!

ఓ ప్రజా ప్రతినిధి సొంత మండలంలో పనిచేస్తున్న సీసీ తప్పు మీద తప్పు చేస్తున్నా ఆయనపై చర్యలు తీసుకోవడానికి జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడంలేదు . గత రెండు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వంలో చేనేకొత్తపల్లి మండలంలో సుమారు 6 లక్షల నుంచి పది లక్షల వరకు అక్రమాలకు కారకుడైన ఆ సీసీని ఎటువంటి చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ చేసి చేతులు వదులుకున్నారు ఉన్నతా అధికారులు. అయితే ఆ సీసీ కొత్త స్థానానికి బదిలీ పై వెళ్లి అక్కడ కూడా చేరిన నెలలోపే మరో అవినీతికి తెరలేపినట్లు అక్కడి మహిళా సంఘాల సభ్యులతో సమాచారం తెలుస్తోంది. ఓ గ్రామంలో తొమ్మిది డ్వాక్రా మహిళ సంఘాలు ఉంటే ఫేక్ డ్వాక్రా సంఘాలను ఐదింటిని తయారుచేసి యానిమేటర్ పదవి క్రియేట్ చేసి సుమారు 9నెలలుగా ప్రతినెల వేతనం స్వాహా చేస్తున్నట్టు సమాచారం తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని కష్టపడి పావలా...పావలా.... కూడ పెడుతున్న మహిళల సొమ్ము దుర్వినియోగం కాకుండా చూడాలని సత్యసాయి జిల్లా వాసులు కోరుతున్నారు.

# గోరంట్ల ఖాకీల వలలో...లక్షలు కాజేసే ఖతర్నాక్ లేడీస్

- అంతర్‌రాష్ట్ర మహిళల దొంగల ముఠాను అరెస్ట్ చేసిన గోరంట్ల పోలీసులు
- పాలసముద్రం హైవేలో పట్టుపడ్డ మధ్యప్రదేశ్ మహిళా ముఠా
- 6 మంది అరెస్ట్...రూ.7.50 లక్షల నగదు, కారు సీజ్
- గోరంట్ల సిఐ బోయ శేఖర్, ఎస్ఐ రామచంద్ర, కానిస్టేబుళ్లకు రివార్డులకై సిఫారసు
- మీడియాకు వివరాలు వెల్లడించిన పెనుకొండ డిఎస్పి నరసింగప్ప




స్వాధీనం చేసుకున్న నగదు, కారును మీడియా ముందు వుంచిన డిఎస్పి, పాత్రికేయులతో మాట్లాడుతున్న పెనుకొండ డిఎస్పి, గోరంట్ల సిఐ



స్వాధీనం చేసుకున్న లక్షల డబ్బు

**గోరంట్ల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

పలు బ్యాంకుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బు డ్రా చేసే అమాయకులను టార్గెట్ చేసి లక్షల రూపాయలను దోచుకెళుతున్న అంతర్‌రాష్ట్ర మహిళల ముఠాను పెనుకొండ డిఎస్పి నరసింగప్ప పర్యవేక్షణలో గోరంట్ల సిఐ బోయ శేఖర్, ఎస్ఐ రామచంద్ర ఆధ్వర్యంలో గోరంట్ల పోలీసులు అతి చాకచక్యంగా వ్యవహరించి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి కటకటాలకు పంపిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు మహిళలతో పాటు ఇద్దరు కారు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని వారి నుండి 7.50 లక్షల రూపాయల నగదును ఒక కారును సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్ నిమిత్తం పెనుకొండ కోర్టుకు తరలించినట్లు పెనుకొండ డిఎస్పి నరసింగప్ప తెలిపారు. గోరంట్ల పట్టణంలో ఈనెల 3వతేదీన ఇదే మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన భుజంగరావు అనే వ్యక్తి స్థానిక స్టేట్ బ్యాంకులో 3.80 లక్షలు డ్రా చేసుకుని బ్యాంకు సమీపంలోని ఒక బట్టల దుకాణం వద్ద డబ్బులు భద్రపరిచిన ద్విచక్ర వాహనాన్ని ఆపి దుకాణంలో బట్టలు కొనుగోలు చేస్తున్న సమయంలో వారి కదలికలను గమనిస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా వారి ద్విచక్రవాహంలోని డబ్బుల సంచిని చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు అయినట్లు తెలిపారు. ఈ ముఠాను పట్టుకోవడంలో గోరంట్ల సిఐ శేఖర్, ఎస్ఐ రామచంద్ర, సిబ్బంది చాలా చాకచక్యంగా వ్యవహరించి అరెస్టు చేయడం అభినందనీయమని జిల్లా ఎస్పి సైతం వారిని అభినందించినట్లు డిఎస్పి తెలిపారు. అయితే ఈ అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా ఇదివరకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు చోట్ల తెలంగాణ రాష్ట్రంలో మూడు చోట్ల కర్ణాటకలో ఒకచోట, ఒరిస్సాలో ఒకచోట చోరీకి పాల్పడి దాదాపు 13 లక్షల వరకు చోరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుల కోసం వేట కొనసాగిస్తున్న తరుణంలో గోరంట్ల మండలంలోని బాలసముద్రం 44వ జాతీయ రహదారిలోని కే హోటల్ వద్ద అనుమానాస్పదంగా వున్న మహిళలను అదుపులోకి తీసుకొని విచారిస్తే చోరీ ఘటనలు వెలుగు చూసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీప్‌మాలబాయి, రేఖబాయి, మమత, మాలబాయితో పాటు డ్రైవర్లు పరిత సిసోడియా, ప్రదీప్ సిసోడియాలను అరెస్ట్ చేశామని వారి నుండి 7.50 లక్షలతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల పోలీసులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలి

- రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై.ఎన్.రవిశేఖర్‌రెడ్డి

**మడకశిర టౌన్,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**


రవి శేఖర్ రెడ్డి.

రాష్ట్రంలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో వైసిపి పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ: వెనకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫీజు కట్టి ప్రైవేట్ పాఠశాలలో చదవలేక ఉచితంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువ, దీనికి కారణం మన జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతం అలాంటప్పుడు లక్షలు, కోట్లు పెట్టి మెడికల్ సీట్ సంపాదించే శక్తి స్తోమత మా ప్రాంత ప్రజలకు విద్యార్థులకు లేదు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేసి మెడికల్ విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షలా చేయడం కేవలం కార్పొరేట్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పెద్దపెట్ట వేస్తుంది అనడానికి ఇదే నిదర్శనం అని అన్నారు. ఈ .ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లోనే వివిధ కారణాలతో కార్పొరేషన్ లోన్లు మరియు ఆర్బీఐ సెక్యూరిటీల వేలం ద్వారా 1,98,000 కోట్ల అప్పు చేశారు అందులో నుంచి ఒక్క నాలుగు వేల కోట్లు ఖర్చు చేసుంటే అన్ని మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే పూర్తి చేయవచ్చు.యోగాంధ్ర కోసం ఒక్క రోజులో450 కోట్లు ఖర్చు చేశారు, ఆ ఖర్చుతో ఒక మెడికల్ కాలేజీ పూర్తి చేయవచ్చు అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వ ప్రకటనల కోసం 900 కోట్లు ఖర్చు చేశారు ఆ డబ్బుతో రెండు మెడికల్ కాలేజీలు కట్టవచ్చు అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం దుబార ఖర్చులను తగ్గించి ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను నిర్వహించాలని ఆయన తెలిపారు. ప్రైవేటు పరం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని వైద్య విద్యను అందరికీ అందించాలని అని అన్నారు. ఇప్పటికే వైద్యం పేదవాడికి దక్కడం లేదు ఈ నేపథ్యంలో ప్రభుత్వమే మెడికల్ కళాశాలలో నిర్వహించడం ద్వారా పేదలకు భవిష్యత్తులో ప్రభుత్వ వైద్యాన్ని అందించడానికి సులభంగా ఉంటుందని కావున ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ వ్యక్తుల కు అప్పజెప్పకుండా ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆలయానికి సిసి కెమెరాలు వితరణ


సీసీ కెమెరాలు అందజేస్తున్న వేణురెడ్డి

**హిందూపురం టౌన్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

హిందూపురం పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయానికి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ముఖ్య నేత వేణురెడ్డి సోమవారం 4 సీసీ కెమెరాలను అందజేశారు. ఎరుకుల సంఘం వారి అభ్యర్థన మేరకు ఎల్లమ్మ దేవి ఆలయానికి సిసి కెమెరాలు అందజేసినట్లు దాత వేణురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎరుకుల సంఘం నాయకులు శంకర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు వేణురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యం


శ్రీధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**హిందూపురం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

మంచి భవిష్యత్తు విద్యతోనే సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. సోమవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, చాణిక్య యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, క్యాన్సిలర్ న్యూ నేషనల్ ఎడ్యుకేషన్ రీఫార్మసీ మెంబర్ శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని సరస్వతి విద్యా మందిరంలో ఆయన జన్మదిన వేడుకలను సహచర ఉద్యోగులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి విద్యా మందిరం రాయలసీమ కార్యదర్శి రాధాకృష్ణ, పరమేశ్వర, రిటైర్డ్ లెక్చరర్ జగదీష్, తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు అన్నిచోట్ల గౌరవించబడతారని విద్య వల్ల సమాజం శోభిస్తుందని భవిష్యత్తులో విద్య మంచి ఫలితాలను అందజేస్తుందని అన్నారు. దీనికి ఉదాహరణ శ్రీధర్ అని ఆయన సేవలను కొనియాడారు. శ్రీధర్ దివ్యాంగుడైనప్పటికీ గొప్ప ప్రతిభాశాలి సరస్వతీ పుత్రుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చారు కీర్తి, మురళీధర్, శంకరప్ప, వెంకటరాముడు, ప్రశాంతి, కళ్యాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్‌కు ఘనసన్మానం


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**లేపాక్షి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

నూతనంగా ఎంపికైన రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ ఈడిగ జయప్పను సోమవారం మండల కేంద్రమైన లేపాక్షిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ ఎత్తున కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్పను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్ జయప్ప మాట్లాడుతూ హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సహకారంతో తనను అధిష్టానం రాష్ట్ర డైరెక్టర్‌గా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అభివృద్ధికి చైర్మన్‌తో కలిసి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అభిలాష్, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, సూర్యప్రకాష్, మాలఅక్క, పరిగి మండల టిడిపి కన్వీనర్ గోవిందరెడ్డి, హిందూపురం టిడిపి నేత అమర్నాథ్, కొండూరు సర్పంచు సిద్దు, అరుణ, డిష్ మంజు, గోవిందు, అంగడి అంజి, జయకృష్ణారెడ్డి, అనిల్, రమేష్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ భవనము ప్రారంభోత్సవం

**గాండ్లపెంట ప్రభాతవార్త సెప్టెంబర్ 15**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ నూతన భవనము మరియు కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభోత్సవానికి కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభిస్తారని కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని తెలుగుదేశం మండల కన్వీనర్ పేర్కొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలో చేరిక


కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజు

**మడకశిర టౌన్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

రొళ్ల మండలం గొల్ల హట్టి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు రంగప్ప, లక్కప్పా,కెంపెగౌడ్, రెడ్డప్ప,పాండురంగప్ప, పూజారి గోవిందప్ప, ముద్దారెడ్డి, మంజునాథ్‌లతోపాటు పది కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గొల్ల హట్టి గ్రామానికి చెందిన వైసిపి పార్టీ నాయకులు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం టిటిడి బోర్డు మెంబర్,ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,ల చేతుల మీదుగా వైసిపి పార్టీని టిడిపిలోకి చేరిన వారికి పసుపు కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, జడ్పిటిసి ఉమేష్, నరసింహమూర్తి,మండల కన్వీనర్లు ఈరన్న, లక్ష్మీ నరసప్ప, కృష్ణమూర్తి, తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి , కుమార్ స్వామి, గణేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి


డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న చేనేత సంగం నాయకులు

**సోమందేపల్లి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన చేనేత మగ్గాలకు 200 యూనిట్లు ఉచితంగా అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది హామీని వెంటనే అమల్లోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలా నారాయణస్వామి, మండలంలోని చేనేత కార్మికులు సోమందేపల్లి డిప్యూటీ తాసిల్దార్ రెడ్డి శేఖర్ కి వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన భాగంగా చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఇచ్చిన చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు హామీని అమలు చేయాలని, అలాగే చేనేత కమిషనర్, విద్యుత్తుకు బిల్లులు చెల్లించాలని అక్కడక్కడ మాత్రమే బిల్లులు వస్తున్నాయని పత్రికాముఖంగా చెప్పడం జరిగింది. కానీ ఇంతవరకు ఎక్కడే గాని ఉచిత విద్యుత్తు “0“ ఇంతవరకు రావడం లేదు. 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికుడు చేనేత పెన్షన్ కోసం 2023 సం లో దరఖాస్తు చేసుకుని పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నామే గాని . చేనేత పెన్షన్ కోసం అప్లై చేసుకొన్న వారందరికీ చేనేత పెన్షన్ లు మంజూరు చేయాలని. అదేవిధంగా చేనేత కార్మికులు పరికరాలు , వర్క్ షెడ్లు కోసం ఇంతకు మునిపే దరఖాస్తు చేసుకోవడం . అధికారులు వచ్చి ఎంక్వయిరీ చేయడం కూడా జరిగింది కానీ ఇంతవరకు పరికరాలు ,వర్క్ షెడ్లు మంజూరు కావడం లేదు సోమందేపల్లి లో నూతనంగా ఏర్పాటు చేయబోతున్న క్లస్టర్ లిస్టు లో నిజమైన చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతోంది. చేనేత కార్మికులను వదిలి పవర్లూమ్ కార్మికులను క్లస్టర్ లో చేర్చుకోవడం జరుగుతోంది. నూతనంగా ఏర్పాటు అయ్యే క్లస్టర్ లో చేనేత కార్మికులకు న్యాయం జరగాలని. చేనేత భరోసా 25వేల రూపాయలు ప్రతి ఒక్క చేనేత కార్మికునికి న్యాయం జరిగేలా విధివిధానాలు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కోరుతోంది అన్నారు ఈ కార్యక్రమంలో దాసరి సుధాకర్, మామిళ్ళ శ్రీనివాసులు, మనతూరి ఈశ్వర్ ,కొత్తపల్లి బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప ఈడిగ నాగరాజు, వడ్డీ నాగరాజు ,పామిశెట్టి మల్లికార్జున, బెస్త వెంకటేశ్వర్లు, కాశీం చేనేత కార్మికులు పాల్గొన్నారు

# గ్రీవెన్స్ సెల్‌లో ఒకే ఒక్క అధికారి!

**అమరాపురం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**


ఖాళీ కుర్చీలు దృశ్యం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుండి వారి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. అమరాపురం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్ లో కేవలం తహసిల్దార్ లక్ష్మీనరసింహం ఒకే ఒక్క అధికారి పాల్గొనడం విశేషం. మిగిలిన అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్ సెల్ కార్యక్రమానికి గైర్హాజరు కావడం శర మామూలుగా కొనసాగుతున్నది. ఒకరిద్దరు మినహా మిగిలిన ముఖ్యమైన శాఖల అధికారులు ప్రతి సోమవారం హాజరు కాకపోవడం ద్వారా ప్రజలు తీవ్ర సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం హాజరు కావలసిన అధికారులు కనీసం ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాకపోవడం ద్వారా ప్రజలు వచ్చి వెనిదిరిగే పరిస్థితి నెలకొన్నది. ముఖ్యంగా అమరాపురం మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉండడం ద్వారా జిల్లాస్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండడంతో కొన్ని శాఖల మండల స్థాయి అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితిలో నెలకొన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి మండల స్థాయి అధికారులు గ్రీవెన్స్‌కు వచ్చే విధంగా చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

# నీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న టిడిపి నాయకులు.

**గోరంట్ల సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

మండలంలోని పాలసముద్రం గ్రామ ప్రజల తాగునీటి సౌకర్యం ప్రభుత్వ నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికి కొళాయి నిరంతరం నీటి సరఫరా అనే లక్ష్యంగా మంత్రి సవితమ్మ చొరవ తో స్థానిక పంచాయతీ నాయకుల నేతృతంలో ట్యాంకు నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాల చెరువు చంద్ర, మాజీ సర్పంచ్ నరేష్, హస్తకళల కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, నిమ్మల శ్రీధర్, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నిమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, వడిగేపల్లి సర్పంచ్ నరసింహమూర్తి, జనసేన మండల అధ్యక్షులు సంతోష్ కుమార్, గోరంట్ల సింగిల్ విండో అధ్యక్షులు శంకర్ రెడ్డి, పాలసముద్రం నాయకులు మనోహర్, సన్నీ, మూర్తి, ఉమా శంకర్, హరీష్ రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని అధికారులకు వినతి

**కొత్తచెరువు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తచెరువు మండల కేంద్రంలో కమ్మపాలెం లో ఉన్న కొత్తచెరువు అమ్మ. ఆలయ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారని వాటిని వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు సోమవారం తాసిల్దార్ బాలాంజనేయులు, ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ఆంజనేయులకు, మేజర్ పంచాయతి సెక్రటరీ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం వేరువేరుగా సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ సెల్ టవర్ నిర్మిస్తే ఆ ప్రాంత ప్రజలు రేడియేషన్ ప్రభావంతో చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని తక్షణమే సెల్ టవర్ నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేయాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో దామోదర్ నాయుడు కిరణ్ శ్రీనివాసులు రవి రాజేష్ రాఘవ రమేష్ టైలర్ రాము అనిల్ హరి తదితరులు పాల్గొన్నారు .

# గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోండి


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

**బత్తలపల్లి, సెప్టెంబర్ 15 ప్రభాత వార్త**

జాతీయ పశువ్యాధి నివారణ పథకం ద్వారా మండలం లో ని పశువులు (ఆవులు, ఎద్దులు, గేదెలు )అన్నింటికీ గాలికుంటు వ్యాది నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారని పశుసంవర్ధక శాఖ డిడి చంద్రశేఖర్ తెలిపారు. టీకాలు వేసే కార్యక్రమం సోమవారం నుండి అక్టోబర్ 15 వరకు ప్రతి గ్రామం లో పశువైద్య సిబ్బంది వెళ్లి వేస్తారని ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగించు కోవాలన్నారు. ఈ టీకాలు వేసి కార్యక్రమం ను గంటాపురం గ్రామం లో ధర్మవరం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్.బి. చంద్రశేఖర్ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం, మేపు మేయక నీరసం వచ్చి పాల దిగుబడి తగ్గిపో తుందన్నారు , పనిచేసే ఎద్దులలో పనిసామర్థం తగ్గుతుంది, నోటిలోపల పుండ్లుతో మేపుమేయవని, కాలి గిట్టలమధ్య గాయలతో నడవలేక పోతాయని, వ్యాది రాకముందే ఇప్పుడు వేస్తున్న టీకాలు వేయించుకోవాలన్నారు. మంగళవారం సైతం గంటాపురం గ్రామం లోనే టీకాలు వేస్తారని, మిగిలిన రైతులు తమ పశువులకు కచ్చితంగా టీ కాను వేయించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్థానిక సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది సురేష్ నాయక్, రాము, మారుతీ, సాయిప్రణవి, పాడి రైతులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కార్డులతో నిత్యావసర సరుకులు


స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**గుమ్మఘట్ట సెప్టెంబరు 15 ప్రభాతవార్త**

అర్హులైన లబ్ధిదారులు స్మార్ట్ బియ్యం కార్డుల ద్వారా చౌక ధాన్యం దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసే నిత్యవసర సరుకులను పొందాలని తహసిల్దార్ రజాక్ వలి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో తహసిల్దార్ రజాక్ వలి తెదేపా మండల కన్వీనర్ గిరి మల్లప్ప ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్న కృష్ణ సర్పంచ్ విజయలక్ష్మి సదాశివ , తెదేపా శ్రేణులతో కలిసి స్మార్ట్ బియ్యం కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన లబ్ధిదారులకు సూచనలు చేస్తూ వచ్చే నెల నుండి ఈ స్మార్ట్ బియ్యం కార్డుల ద్వారా మీ పరిధిలోని చౌక ధాన్యం దుకాణాల్లో నిత్యవసర సరుకులు తీసుకోవాలని తాసిల్దార్ లబ్ధిదారుల కు సూచించారు. మండలంలో 44 చౌక ధాన్యం దుకాణాలు ఉన్నాయని మొదటి విడతలు 16053 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేసిందని మండల పరిధిలోని అన్ని చౌక ధాన్యం దుకాణాల డీలర్లకు అందజేయడం జరిగిందని డీలర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్టు తహసిల్దార్ తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో మండలములోని అన్ని చౌక ధాన్యపు డిపో డీలర్ల కు సమావేశం నిర్వహించి స్మార్ట్ కార్డుల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేసే విధానం తెలియపరచామని మొదటి కార్డులు అందని లబ్ధిదారులకు రెండవ విడుదల పంపిణీ చేయనన్నట్లు తాసిల్దార్ చెప్పారు. మండల కేంద్రంలోని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్న కృష్ణ స్థానిక తెదేపా నాయకుతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు

# ఘనంగా జాతీయ ఇంజనీర్స్ డే వేడుకలు


మాట్లాడుతున్న భూతన్న

**మడకశిర సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

మండల పరిధి లోని టిడి పల్లి లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు భారత దేశ మొదటి సివిల్ ఇంజనీర్ శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడుకే. భూతన్న మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప పండితుడు, రాజనీతిజ్ఞుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు తన అద్భుతమైన ప్రతిభా పాటవాలచే దేశంలో ప్రముఖ ఆనకట్టను నిర్మించడంలో గాని, అనేక ప్రాంతాల్లో వరద దుర్భేద్యమైన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో అయితేనేమి, వైజాగ్ ఫోర్ట్, తిరుమల ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంలో అయితే నేమి మనదేశంలో శాస్త్ర సాంకేతిక విద్యల రూపకల్పనకు, వాటి అభివృద్ధికి కీలక భూమిక వహిస్తూ భారతీయులచే ప్రణాళికల పితామహుడిగా కీర్తించబడుతూ భారత ప్రభుత్వము చే భారతరత్న అవార్డుతో పాటు ప్రతిష్టాత్మకమైన నైట్ హుడ్ ను కూడా సొంతం చేసుకున్న సాంకేతిక రంగాల్లో అద్భుతాలను సృష్టించి ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత అయిన విశ్వేశ్వరయ్య ఎంతో మందికి ఆదర్శం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిపి.రవీంద్ర, జి. రామకృష్ణ కె.రఘునాథరావు పరమేశ్వర్, సరిత, చైతన్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ సమస్యలను వేదాంతంగా పరిష్కరించండి

ఇంఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి

**పుట్టపర్తి(కలెక్టరేట్), సెప్టెంబర్ 15, ప్రభాతవార్త**

ప్రతి సోమవారం తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో వచ్చే అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తిచెందేలా , వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఇంఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఇంఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి తోపాటు పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిపివో సమత హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఇంఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, నిర్ణీత గడువులోపు పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్ తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు. మొత్తం 232 అర్జీలను స్వీకరించడం జరిగిందని తెలిపారు.

# మన మిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని బహిష్కరించాలని ఎంపిడిఓకు వినతి


ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

**రామగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యకు కారణం అవుతున్న మన మిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని బహిష్కరణ కోరుతూ గ్రామ/వార్డు సచివాలయ ఐక్య వేదిక ఎంపిడిఓకి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ నెల 5న అధికారికంగా విడుదల చేసిన ఆదేశాల మేరకు వారు తెలియజేస్తూ.. గతంలో వాలెంటీర్లకు ఒక క్లస్టర్ చొప్పున విధులు ఉంటే ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు అధిక క్లస్టర్లను కేటాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కావున మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని వారు కోరారు.

# పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ శ్రీనివాసులు

**రామగిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

రామగిరి మండలం లోని పలు పాఠశాలలను రామగిరి మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని గంగంపల్లి తండా, గంగం పల్లి, నసనకోట గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి విద్యా ర్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, మెనూ తప్పకుండా పాటించాలని ,సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

# కక్కలపల్లి కాలనీ, ఏ. నారాయణపురం పంచాయతీలను మున్సిపాలిటీలో కలపాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**అనంతపురం రూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ,ఏ. నారాయణపురం, గ్రామ పంచాయతీలనుఅనంతపురం నగర పాలక సంస్థ లోకి విలీనం చేయాలనీ మతం శ్యాంసుందర్ శాస్త్రి, కుక్కల పల్లి కాలనీ గ్రామ సర్పంచ్ తేజస్విని, ఎంపీటీసీ వడ్డే శ్రీనివాసులు, రూరల్ మండలం మాజీ యూత్ కన్వీనర్ కే శ్రీనివాసులు, తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు కలెక్టర్కు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత నగరానికి దగ్గర్లో ఉన్న కక్కలపల్లి కాలనీ పంచాయతీ, ఏ నారాయణపురం గ్రామ పంచాయతీలను అనంతపురంమున్సిపాలిటీలో విలీనం చేస్తే ఈ గ్రామ పంచాయతీలో నివసించే ప్రజలందరికీ మున్సిపాలిటీలకు అందే మౌలిక సదుపాయాలు అన్ని అందడంతో పాటు గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని, కావున ఈ రెండు గ్రామాలను అనంత మునిసిపాలిటీలో కలపాలని ఆ గ్రామాల నాయకులు ప్రజలు కోరుతున్నారని ప్రభుత్వానికి నివేదిక పంపి రెండు గ్రామాలు అనంత నగర పాలక మున్సిపాలిటీలో కలిపే విధంగా కృషి చేయాలని అధికారులను కోరడం జరిగిందన్నారు. అనంతరం వారు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మతం శ్యామ్ సుందర్ శాస్త్రి, ఎంపీటీసీ,వడ్డే శ్రీనివాస్, కె.శ్రీనివాస్, సర్పంచ్, తేజస్విని, వార్డ్ సభ్యులు, నారాయణస్వామి, స్రవంతి, వరలక్ష్మి,వెంకటేష్, అన్ను,రామిరెడ్డి పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

**బెలుగుప్ప, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల పరిధిలోని ఎలగలవంక జిల్లా ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు రఘురామ్, సూరిబాబు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా సెలెక్ట్ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ

**అగళి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త**

మండల పరిధిలోని మధూడి బిసి బాలుర వసతి గృహాన్ని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు చదువుతున్న సందర్భంగా విద్యార్థులతో మమేకమై వివిధ ప్రశ్నలను సంధించి వారి నుంచి సమాధానాలను రాబట్టారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

## రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు రైతు సేవా కేంద్రం ద్వారా పంపిణీ చేయాలి

### - జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్

శింగనమల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

.రైతులకు యూరియా, పెసర, అలసంద, ఉలవ, సజ్జ, జొన్న, రాగి, కొర్ర ప్రత్యామ్నాయ విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా అందించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రైతులకు సరిపడా యూరియా అందించాలని మండల కేంద్ర ంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ. .రైతాంగానికి సకాలంలో ఎరువులు అందించకపోవడం శోచనీ యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్క రించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. హెచ్ఎల్సి హంద్రీనీవా ద్వారా పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు పంటలు పండేలా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మధు యాదవ్, సహాయ కార్యదర్శి చేనేత మధు, చికెన్ బాషా, రైతు సంఘం మండల అధ్యక్షులు భయన్న, వెంకటరెడ్డి, నారప్ప, రామసుబ్బారెడ్డి, అజయ్, తాతయ్య, చిరంజీవి, నాగప్ప, రామకృష్ణ, అంజినప్ప, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అనంతసాగర్ కాలని లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

బుక్కరాయసముద్రం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


రేషన్‌కార్డులు పంపిణీచేస్తున్న అధికారులు,టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని అనంత సాగర్ కాలనిలో సోమవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ ఆదేశాల మేరకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅదితులుగా మండల తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఇన్‌చార్జి ఎంపిడిఓ సదాశివా, టిడిపి నాయకులు పాల్గొన్నా రు.ఈ సందర్బంగ వారు మాట్లడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపి ణీ చేయడం జరుగుతుం దన్నారు.ఈ కార్యక్రమంలో వరితోపాటు టిడిపి నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, పొడరాళ్ళ రవీంద్ర, ఓబులపతి, జొన్న రామయ్య,టిడిపి మాజీ కన్వీనర్ దండు వారిపల్లి ఆదినారాయణ, అన్నేరి కిరణ్‌కుమార్, గోవిందు రెడ్డి, పెద్దప్ప, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, రామక్రి ష్ణరెడ్డి,బండిబాలు,డీలర్ రాజేశ్వరి, ఆదినారాయణ, తదితిరులు పాల్గొన్నారు.

## కోళ్ల పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించండి

### - సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

శింగనమల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

మండల పరిధిలోని రాచేపల్లి గ్రామం వద్ద ఉన్న తోళ్ల పరిశ్రమను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు శేషారెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని రైతులందరికీ యూరియా అందు బాటులో ఉంచాలని గ్రామాల్లో ప్రభలుతున్న విష జ్వరాలను వైద్యులు వెంటనే అదుపు చేసేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. తరిమెల గ్రామం లో రైతు సేవా కేంద్రంలో దాదాపు 8 వారాలనుంచి మూత పడిందని, వెంటనే రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగేంద్ర, భాస్కర్, వెంకటేష్, ఎరిస్వామి, సూర్యప్రకాష్, రమణ, సుంకన్న, కొండారెడ్డి, శ్రీనివాసులు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ - తహశీల్దారు శేషారెడ్డి


మాట్లాడుతున్న తహశీల్దారు శేషారెడ్డి


రేషన్‌కార్డులు లబ్దిదారులకు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

శింగనమల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బిసి కాలనీలో సోమవారం తహశీల్దారు శేషారెడ్డి ఆధ్వర్యంలో లబ్దిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు శేషారెడ్డి మాట్లాడుతూ. ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా తీర్చి దిద్దేందుకు రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం నూతనంగా స్మార్ట్ కార్డులను మంజూరు చేసిందన్నారు. అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన రేషన్‌కార్డులను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి చంద్రకళ, డిప్యూటీ తహశీల్దారు, టిడిపి సీనియర్ నాయకులు గోఓరంట్ల మారుతినాయుడు, ఆయకట్టు సంఘం అధ్యక్షులు బోయ సత్యనారాయణ, నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారా యణ, టిడిపి సీనియర్ నాయకులు సి.వెంకటేషులు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మాసుల్ చంద్రమోహన్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు శంకర్‌నారా యణ, నన్నేసాబ్, డీలర్ మసూద్‌వలి (మొద్దు), సత్యనారాయణ, శివ, బండి వెంకటనారాయణ, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## క్లస్టర్‌లో ఉన్న ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టలలో నియమించాలి - ఎస్‌టియు డిమాండ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సమస్యల సేకరణ సభ్యత్వ స్వీకరణ కార్యక్రమంలో ఆత్మకూరు మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి ఉపాధ్యాయుల నుండి సేకరించిన సమాచారం మేరకు అన్ని యాజమాన్యాలలో పని చేస్తున్న క్లస్టర్ ఉపాధ్యాయులకు డిఎస్‌సి, అంతర జిల్లా బదిలీల్లో వచ్చే వారి కంటే ముం దుగా శాశ్వత ప్రాతిపదికన స్థానాలను కేటాయించి వారికి న్యాయం చేయాలి. పదవీ విరమ ణ పొందిన ఉపాధ్యాయుల ఖాళీలు, జూన్, జులై, ఆగస్టు నెలలో జరిగిన అడ్మిషన్‌ల సంఖ్యకు అనుగుణంగా ఉన్న ఖాళీలకు క్లస్టర్‌లలో పని చేస్తున్న వారిని నియమిస్తే భవిష్యత్‌లో వారు చేరిన స్థానాలలో సీనియారిటీ కోల్పో కుండా ఉంటారు. లేని పక్షంలో వారు అన్యాయానికి గురి అవుతారని ఎస్‌టియు నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్ రమణారెడ్డి, మండల అధ్యక్షుడు నిట్టూరు చంద్రశేఖర రావు, మండల ప్రధాన కార్యదర్శి వై.రవి, జిల్లా నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు విశ్వకర్మ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

విశ్వబ్రాహ్మిణ్ కమ్యునిటీ, మేనేజింగ్‌డైరెక్టర్, ఎపి విశ్వబ్రాహ్మిణ్ వెల్ఫేర్ డైవలప్‌మెంట్ కార్పోరేషన్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 17 (బుధవారం)న విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున బిసిడబ్ల్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అనంతపురం ఓల్డ్ టౌన్ (రాణినగర్)లోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్దగల విశ్వకర్మ కళ్యాణ మండపం రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులంతా పాల్గొని విజయవంతం చేయాలని అందులో పేర్కొన్నారు.

## నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం

### - టిడిపి ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ - లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

పామిడి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


స్మార్ట్ రేషన్ కార్డుల ప్రయోజనాలను వివరిస్తున్న రెవెన్యూ అధికారిణి


లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

ముఖ్యమంత్రి నారా చందబాబునాయుడు సారాద్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుండి ప్రజాసేవలో వినూత్నంగా ముం దుకెళ్తూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని నెహ్రూ కాలనీలో సోమవారం గుమ్మనూరు ఈశ్వర్ అధికారులతో కలిసి లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రేషన్ పంపిణీ వ్యవస్థను తప్పదారి పట్టించిందని అందువల్ల ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ పంపిణీలో స్మార్ట్ విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వ చౌకా దాన్యపు డిపోల ద్వార నిత్యవసర సరుకుల పంపిణీ పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సాంకేతికత వినియోగంతో స్మార్ట్ రేషన్ కార్డులను తయారు చేసి పంపిణీ చేపట్టిందని తెలియజేస్తూ లబ్దిదారులు రేషన్ తీసుకోగానే కార్డులోని క్యూఆర్ కోడ్ ద్వార కేంద్ర, జిల్లా కార్యాలయాలనకు సమాచారం అందుతుందంటూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే కుటుంబ యజమాని సభ్యుల పేర్లు ప్రదర్శింప బడుతాయని తెలియజేశారు. స్మార్ట్ కార్డుల పంపిణీతో బహుళ ప్రయోజ నాలు ఉంటాయని సచివాలయ ఉద్యోగుల ద్వార లబ్దిదారులకు ఇళ్ళ వద్దనే నేరుగా కార్డులను పంపిణీ చేయి స్తుం డటం శుభపరిణామం అని గుమ్మనూరు ఈశ్వర్ వెల్లడించారు. ఈకా ర్యక్రమ ంలో తహశీల్దార్ షర్మిల, డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమ నాయుడు, టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, రాజేష్‌నాయక్, గౌస్‌ఫీర, ఓబుళాపురం వెంకటేష్, బొమ్మా మోహన్, కరూరు శివశకర్, వడ్డే ఆనంద్, బాస్కర్ నాయకుడు, కుమార్, జనసేనపార్టీ అధ్యక్షులు ధనుంజయ, సచివాల యాలు, గ్రామపంచాయతీ ఉద్యోగులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీటీఎఫ్ నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


నిరసన వ్యక్తం చేస్తున్న ఏపిటిఎఫ్ నాయకులు


ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఏపీటీఎఫ్ నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండని అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్‌సి రాజుద్దీన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి నరసింహులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయుల న్యాయమై న, దీర్ఘ కాలిక అపరిష్కృత సమస్యల కోసం పోరుబాట పట్టిందన్నారు. అందులో దశలవా రీగా ప్రాతి నిధ్యాలు, నిరసనలు, ఆందోళననలు, సిఎం అండ్ సిఎస్‌లకు మెయిల్ చేయడం ద్వారా సమస్యలను పరోక్షంగా, ప్రత్యక్షంగా పాలకులకు, అధికారు లకు చేరవేయడానికి నిరసన వారం కార్యక్రమాన్ని చేపట్టామని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన కోరికలను తీర్చాలని లేకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు తాలూకా లెవెల్‌లోఅనంతపురం తాసిల్దా రుకి మెమోరాండం అందించారు. అనంతరం ఎంపి అంబికా లక్ష్మినారాయ ణకు సైతం వినతిపత్ర ం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి రాజుద్దీన్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షు లు డి.గాయత్రి, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు బాల ముద్దన్న, సూర్యనారాయణ, లక్ష్మినారాయణ, శివారెడ్డి, ఎల్లప్ప, పర్వతయ్య, తిప్పేస్వామి, శ్రీనివాసులు, సయ్యద్ ఖలీమ్, హనుమంతు, రామలింగ, పవన్ కుమార్, కలిముల్లా, నాగరాజు, రామ్మూర్తి, ఫక్రుద్దీన్, సుహేల్, బాబ్జాన్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పులే..ఉరితాడై యువరైతు ఆత్మహత్య - పెట్టుబడులే యువరైతును బలి తీశాయ్

ఆత్మకూరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


ఉరితాడుకు వ్రేలాడుతున్న రైతు కుంటెన్న


యువరైతు కుటుంబసభ్యుల ఫోటో

నమ్ముకున్న పొలం నుండి తగినంత రాబడి రాకపోగా కుప్పులు తెప్పలుగా అప్పులు చేసిన ఆ యువరైతు కట్టుకున్న భార్యబిడ్డలను మరిచి భార్యను పుట్టింటికి పంపి,పిల్లను బడికి పంపించి నివాసం ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకొని తనువు చాలించాడు.వివరాల్లోకెళ్లితే ఆత్మకూరు మండలం పోలీసుల కథనం మేరకు పి.యాలేరు గ్రామానికి చెందిన దళిత యువరైతు కుంటెన్న (38) నాలుగు ఎకరాల మెట్ట,3 ఎకరాల వ్యవసాయతోట భూమిని సాగు చేస్తూ జీవనం గడిపేవాడు.దాదాపు 3 ఎకరాల్లో తడి వరిపంట సాగు చేయగా.గత మూడేళ్ల నుండి తగినంత చేతికి రాకాపోగా,చీనీ పంట ధర కూడా చేతికి రాకపోవడంతో కొంత రాబడి కోసం చేసిన అప్పులు 10 లక్షలపైచిలుకు కావడంతో చేసేది లేక ఎవరూ లేని సమయంలో నివాసం ఉంటున్న ఇం ట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుం టెన్నకు భార్య ముత్యాలమ్మతో పాటు ఇంటర్ చదువుతున్న వెన్నల,ఆరో తరగతి చదువుతున్న సాయి పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదే హాన్ని జిల్లా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు.

## ప్రకృతి తోనే మానవ వికాసం సాధ్యం

### - వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం విజయశ్రీ

అనంతపురం వైద్యం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


విద్యార్థుల ను అభినందిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశ్రీ

మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ అనంతపురం రామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో "మానవ వికాసానికి ప్రకృతితో శృతి కలిగి ఉండడం చాలా అవసరం" అనే అంశం పైన వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. ప్రతి సంవత్సరం రామచంద్ర మిషన్, కామన్వెల్త్, యునెస్కో సౌజన్యంతో భారతదేశంలోని అన్ని కళాశాలల విద్యార్థులకు ఒక ఉత్తమ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయిలో దేశ స్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు అందించడం జరుగుతుంది అని, అలా ఈ సంవత్సరం కూడా వైద్య విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎం విజయశ్రీ మాట్లాడుతూ మానవ వికాసానికి ప్రకృతి ఎంతగానో తోడ్పడుతుందని, అందుకనే ప్రకృతితో శృతి కలిగి ఉండడం చాలా అవసరమని, ప్రకృతిని భావితరాల కోసం కాపాడడం సామాజిక బాధ్యతని సామాజిక బాధ్యత అని తెలిపారు. మా వైద్య కళాశాల విద్యార్థుల సామాజిక దృక్పథం అభినందనీయమని, సామాజిక సేవలో మెడికల్ కళాశాల విద్యార్థులు ఎప్పుడు ముందుంటారని అభినందనలు తెలియజేశారు. వ్యాసరచన పోటీలలో పాల్గొన్న ప్రతి విద్యార్థి జవాబు పత్రాన్ని శ్రీరామచంద్ర మిషన్ కు అందించడం జరుగుతుందని, బహుమతులు వచ్చే నెలలో తెలియజేస్తారని తెలిపారు.హార్ట్ ఫుల్ మెడిటేషన్ శిక్షకులు శరీర ధర్మ శాస్త్ర ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ సరళ, పీడియాట్రిక్స్ డాక్టర్ శంకర్ నారాయణ లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఈ పోటీలలో గెలుపొందిన రేడియాలజీ పి.జీ డాక్టర్ డి రజిత, ఫిజియాలజీ పీజీ డాక్టర్ ఎం రేణుక, వైద్య విద్యార్థులు ఒరుగంటి నిత్యశ్రీ, వాల్మీకి సాయి విష్ణు ప్రియ, శ్రీ సాయి, పి ఆర్ శ్రీ చరిత, హర్ష శ్రీ విష్ణు, ప్రీతం, బృంద రాజ్, కె ఎస్ ముస్కాన్, హిమ వంశీ, రాజశేఖర్ రెడ్డి,లకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ శిక్షకులు ఫిజియాలజీ హెచ్ ఓ డి హెచ్ ఓ డి డాక్టర్ సరళ, పీడియాట్రిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకరనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుమన గోపీచంద్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు లు ప్రశంసా పత్రము మెడల్స్‌తో సత్కరించారు.

## వ్యాధి నిరోధక టీకాల యు విన్ పోర్టల్ అవగాహన పోస్టర్స్ విడుదల

అనంతపురం వైద్యం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఇతర వైద్య బృందం

వ్యాధి నిరోధక టీకాల సులభ విధానం యు విన్ పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది ఇందులో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు ఈ పోస్టర్ లను జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఈ బి దేవి విడుదల చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు వేయడం సులభతరంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ పోర్టల్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు ముఖ్యంగా గర్భిణి లు , చిన్న పిల్లలు ఏ వ్యాక్సిన్లను కూడా మిస్ కాకుండా చూసుకోవడం కోసం ఈ విధానం ఉపయోగ పడుతుందని తెలిపారు ,కావున జిల్లా లోని వైద్య సిబ్బంది ఈ పోర్టల్‌ను వ్యాక్సిన్ ను వేయవలసిన అవసరం వున్న వారికి అందరికి ఈ విధా నాన్ని అందుబాటులో ఉండేలా ప్రజలందరికీ అవగా హనకల్పి ంచాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ , డి య ల్ ఏ టి ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ , డా విష్ణుమూర్తి, డెమో త్యాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్చకుల సమస్య ల పరిష్కారానికి కృషి

అనంతపురం వైద్యం, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


డిప్యూటీ కమిషనర్ ను ఆహ్వానిస్తున్న అర్చక సమాఖ్య ప్రతినిధులు

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వైపి ఆంజనేయులు తెలిపారు. సెప్టెంబర్ 17న ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అర్చక సమస్యల పరిష్కారానికి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్, అనంతపురం జిల్లా సత్య సాయి జిల్లా అసిస్టెంట్ కమిషనర్లు, హాజరవుతారు అన్నరు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వైపి ఆంజనేయులు మాట్లాడుతూ అర్చకుల సమస్యలు పరిష్కారం కోసం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని, ఈ సమావేశానికి హాజరయ్య అర్చకులు మీయొక్క సమస్యలను అర్జీ రూపంలో రాసుకొని సంబంధిత శాఖ అధికారులకు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా అర్చకుల సమస్యలు పరిష్కారం కోసం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అర్చకులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మిగిలిపోయిన బార్లకు మరొకసారి దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం వైద్యం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

కొత్త బార్ పాలసీల భాగంగా జిల్లాలో మిగిలిన 9 బార్లకు గతంలో నోటిఫికేషన్ జారీ చేయగా ఆ బార్లకు ఎలాంటి దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం దరఖాస్తు గడువును తిరిగి 17వ తేదీ దాకా పొడిగించినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆశావాహకులు కొత్త బార్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఈ నెల 18వ తేదీన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా కొత్త బార్ లైసెన్సులు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరసన

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


నిరసన తెలుపుతున్న ఏపిటిఎఫ్ నాయకులు

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట తాడిపత్రి జోనల్ కార్యదర్శి డేనియల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సంద ర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘు రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరిం చకపోవడం వల్లనే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన చేపట్టడం జరిగిందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి మెరుగైనటువంటి పెన్షన్ విధానాన్ని తెస్తామని చెప్పారు కానీ నేటి వరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం పైన చర్చ కూడా లేదన్నారు. మేము అధికారంలోకి వస్తే ఒక్క డిఏ కూడా పెండింగ్ లేకుండా కేంద్ర ప్రభుత్వం పెంచిన ప్రతిసారి మేము కూడా పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో పెట్టడం సరైన విధానం కాదన్నారు. బకాయిలు ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమీషన్ వెంటనే నియమించి మధ్యంతర భృతి 30 శాతంను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎం.రఘురాంరెడ్డి, జిల్లా కార్యదర్శి డేనియల్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయచంద్ర, రామ్ కిషోర్, అంకాలు, అంజన్,రామాంజనేయులు, విష్ణు, రవిశంకర్, భాస్కర్‌రెడ్డి, ఉపేంద్ర, తారకమ్మ, వరలక్ష్మి, నాగవేణి, ఏపిటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగుసిన ఎన్సిసి ట్రైనింగ్ క్యాంప్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త


ట్రైనింగ్ అనంతరం ఎన్‌సిసి క్యాడెట్లు

కర్నూల్ గ్రూప్ ఆధ్వర్యంలో వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ వారి సహకా రంతో కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్, అనంతపురం లోని బ్రాహ్మణ పల్లిలో విజయవంతంగా ముగించినట్లు క్యాంపు కమాం డెంట్, వైవికే చైతన్ రెడ్డి తెలిపారు. పది రోజుల నుండి ఎన్సిసి క్రెడిట్లకు, ఫైరింగ్ డ్రిల్ 108 ట్రాఫిక్ వివిధ అంశాలపై ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు, ఈరోజు ముగిసిన సాంస్కృతి కార్యక్రమాలతో క్రీడల్లో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రధానం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు, సుధీర్ గోవింద నాయుడు, శాంతమ్మ, దేవమ్మ, ఆఫీస్ సూపరింటెండెంట్లు పవన్ కుమార్, ప్రసాద్, పిఏ స్టాఫ్ రవికుమార్, అప్పా రావు, సంజీవ్, రాజేష్, నాయక్ విజయ్ కుమార్, హవల్దార్ రూప రామ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయులే దేశానికి దిక్సూచి

### - ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు

అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త



అవార్డ్ అందుకుంటున్న మండ్లి కిశోర్ కుమార్

అనంతపురానికి చెందిన డాక్టర్ మండ్లి కిషోర్ కుమార్ ఖిషాన్ ఇండియా టీచర్ ఐకాన్ అవార్డ్ 14 సెప్టెంబర్ 2025 గుంటూరులో ఇస్రో శాస్త్రవేత్త చందు సాంబశివరావు చేతుల మీదుగా అందుకోవడం జరిగినది సివిఆర్ పాఠశాల యాజమాన్యం తెలిపారు. గుంటూరు నగరంలోని కెన్నడీ నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఖిషాన్ ఇండియా టీచర్ ఐకాన్‌ఖి అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ అనిల్ రామనాధం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని సత్కరించేందుకు వేదికగా నిలిచింది అని అన్నారు.ఈ వేడుకలో దేశ నలుమూలల నుంచి 1000 మందికి పైగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇస్రోనాసా శాస్త్రవేత్త, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు చందు సాంబశివరావు, బీజేపీ సీనియర్ నాయకుడు మాగంటి సుధాకర్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చందు సాంబశివరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలు బోధించే వారే కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గనిర్దేశకులని కొనియాడారు. అనంతరం ఆయన అవార్డు గ్రహీతలను అభినందించి, విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రాముఖ్యత, దాని ప్రభావం గురించి ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం నిర్వాహకులు అవార్డు గ్రహీతలకు మెమెంటోలు, బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల నిర్వాహకులు అనిల్ రామనాధం ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులుకిశోర్ కుమార్ అభినందనలు తెలిపారు.

## గురువులకు ఘన సత్కారం..

### - తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నిలిచిన అప్పుస్కా

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


అవార్డును పొందిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

చిగురు వాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం రాయలసీమజోన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్థానిక 3 వ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాల నుండి పి.ఫరీ ద, యమ్.ప్రశాంతి ఇద్దరు ఉపాధ్యయినీలు ఉత్తమ టీచర్ అవార్డ్ పొందారు. పాఠశాల డైరెక్టర్లు ఎం.పీ.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, పాఠశాల ప్రిన్సిపల్ జి.లావణ్య మాట్లాడుతూ.. మా పాఠశాల టీచర్స్ ఈ అవార్డును పొందడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డీలకు శుభాకాంక్షలు తెలిపారు.

## యస్వీ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త


విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్న దృశ్యం

విద్యార్థినిలలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే తమ లక్ష్యమని యస్‌వి డిగ్రీ అండ్ పిజి కళాశాల విద్యాసంస్థ వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి అన్నారు. సోమవారం ఎస్‌వి డిగ్రీ అండ్ పిజి కళాశాలలో నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ వారి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ సెప్టెంబర్ 15 నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఎస్‌వి డిగ్రీ అండ్ పిజి కళాశాలలో ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఫైనల్ ఇయర్ విద్యార్థినిలకు ప్రారంభించారు. ఫైనల్ ఇయర్ విద్యార్థినిలు 80 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. చివరి రోజు స్కిల్ ప్రోగ్రాంలో శిక్షణ పొందిన విద్యార్థినలకు నాంది ఫౌండేషన్ వారు ట్రైనింగ్ సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినీలు డిగ్రీ అయిపోయిన తర్వాత మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించుటకు, కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్‌లో మంచి ర్యాంకులు సాధించుటకు ఈ శిక్షణ దోహదపడుతుందని తెలిపారు. మల్టీ నేషనల్ కంపెనీలకు కావలసిన స్కిల్స్‌ను విద్యార్థులకు అందజేయడం ద్వారా విద్యార్థినిలు స్టేజ్ ఫియర్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రజెంటేషన్ స్కిల్స్, రీజనింగ్ ఆప్టిట్యూడ్స్‌లో నైపుణ్యం సాధించగలరని, ఈ స్కిల్స్ ద్వారా డిగ్రీ అయిపోయిన వెంటనే మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించుటకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ.వి.ప్రసాద్, ఏవో.శ్రీనాథ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ యస్.సాయిరాం నాంది ఫౌండేషన్ సిబ్బంది వై.హరికుమార్, వై.శ్రీనివాసులు, కళాశాల, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, PATIL JAGANMOHANA REDDY (OLD NAME) S/O PATIL SUBBA REDDY, H.NO: 1-33, KURUGUNTA -515751 ANANTAPUR DISTRICT (A.P.). I HAVE CHANGED MY NAME FROM PATIL JAGANMOHANA REDDY (OLD NAME) TO PATIL JAGANMOHAN REDDY (NEW NAME) HENCEFORTH I AM BEING CALLED PATIL JAGANMOHAN REDDY (NEW NAME) FOR ALL PURPOSES.

04ATP15_04ATP15.qxd 15-09-2025 PM 11:48 Page 1



## కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

కలియుగ దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం సహచర ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు.

అంతకు ముందు తిరుమతిలో జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత పార్లమెంటరీ, శాసనసభ కమిటీల సమావేశంలో భాగంగా చంద్రగిరి పోర్టులో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు.


శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భూమా అఖిల ప్రియ, బండారు శ్రావణిశ్రీ

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లు, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

జాతీయస్థాయి కరాటే పోటీల్లో కొనకొండ్లలోని భారత్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గోజురుయా కరాటే డో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సెప్టెం బర్ 14న కర్నూలు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. అండర్-10 విభాగంలో ఎం.అఖిల్, ఎం.మణికంఠ, యు.సంతోష్‌లు గోల్డ్ మెడల్ సాధించారు. అండర్-14 విభాగంలో బి.కుష్వంత్‌కుమార్, కే.హర్షవర్ధన్, జె.ఎం. అభిలాష, వై.జయకృష్ణ, ఆర్.మురళీధర్‌నాయక్‌లు వెండి పతకాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. అలాగే ఇదే విభాగాల్లో 16 మంది విద్యా ర్థినీ, విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, శిక్షకులు రవితేజ మా స్టర్, సాయి కుమార్‌లను పాఠశాల కరస్పాండెంట్ మంజుల వెంకటేష్ అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ మంజుల వెంకటేష్

## ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం,

### తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి రైతుల పక్షాన రెవిన్యూ అధికారులను నిలదీసిన పరిటాల శ్రీరామ్

### తాహసిల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన పరిటాల శ్రీరామ్

తాడిమర్రి సెప్టెంబర్ 15 (ప్రభాతవార్త)

మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలో పర్యటించిన ఆయన బాధితుల పక్షాన తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి సమస్యలపై తాసిల్దార్ భాస్కర్ రెడ్డిని నిలదీశారు. ఈ సందర్భ ంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండల పరిధిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని. కొందరు వీఆర్ఓలు తహసీల్దార్ పేరు చెప్పి కాలయాపన చేస్తున్నారని తహసీల్దార్ కార్యాలయంలో కూడా సరైన సమాధానం లేకపోవడంతో పలువురు బాధితులు స్వయంగా తమ వద్దకు వచ్చి గోడు వెల్లబోసుకున్నారని పరిటాల శ్రీరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఫోన్ ద్వారా సమస్య వివరించినా పట్టించుకోకపోవడంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్‌కు స్వయంగా రావడం జరిగిందని అన్నారు. తహసీల్దార్ వద్దకు బాధితులతో వెళ్లి బాధితుల ఆవేదనను వినిపించారు. కొన్ని ఉదాహరణలను కూడా చూపి స్తూ.. ఎందుకు వీటిని పరిష్కరించడం లేదని నిలదీశారు. సమాధానం దాట వేస్తు కాలయాపన చేస్తున్న వీఆర్ఓలను కూడా అధికారుల వద్దకు పిలిపించారు. వారు ఒకరిపై ఒకరు చెప్పుకోవడంతో బాధితులు, తమదాకా వచ్చారని అసహనం వ్యక్తం చేశారు. తాతల కాలం నుండి ఉన్న భూమిని ఇతరుల పేరు మీదకి మార్చ డం.ఆస్తులను తగ్గించడం లాంటివి చేశారన్నారు. అసలు తమ ప్రమేయం లేకుండా రికార్డులు ఎలా మారుస్తారని బాధితులు నిలదీ శారు. దీనిపై తహసీల్దార్ అసలు పట్టించుకోవడం లేదని ఆయన ముందే వాపోయారు. న్యాయమైన వాటిని కూడా పరిష్కరించడానికి నెలల తరబడి తిప్పడం సరైంది కాదని ఇక నుంచి ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాల యాపన చేయడం మానేసి పనులు చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముసుగు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రాగే పెద్ద ఎల్లప్ప, కొడిదల సాయి, విశ్వనాథ్,జనార్ధన్ నాయుడు శ్రీనివాసరెడ్డి, చిల్ల కొండయ్య పల్లి రమణ, మోదుగులకుంట సుధాకర్ నాయుడు,పక్కిరిగాళ్ల గణేష్, ఆకులేటి లక్ష్మీనారాయణ, తో పాటు పెద్ద ఎత్తున టిడిపి నాయకులు కార్యకర్తలు బాధిత రైతులు పాల్గొన్నారు.


బాధితులతో కలిసి తహసిల్దార్ కార్యాలయానికి వస్తున్న పరిటాల శ్రీరామ్


అగ్రహారం, ఆత్మకూరు భూ సమస్యల గురించి శ్రీరామ్ కు వివరిస్తున్న బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు

## సమయపాలన పాటించని సిబ్బంది

### పలుచోట్ల డుమ్మాకొడుతున్న కొందరు టీచర్లు - సరిగా అందని పోషకదార్థాలు

ఆత్మకూరు సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.ఉదయం 9 గంటలకు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు ఉండాల్సి ఉండగా వారు సమయానికి రాకుండా ఇష్టానేసారంగా వస్తుట్లు విమర్శులు వినిపిస్తున్నాయి.ఇలాగైతే అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల చదువులు ఎలా కొనసాగుతాయని స్థానిక ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు.అంగన్వాడీ సెంటర్లో ఆలనాపాలన కరువైందని,పర్యవేక్షణ తూతూ మంత్రంగా ఉండటంతో అంగన్వాడీ సెంటర్లో కే ంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు నెరవేరడం లేదనేది నగ్నసత్యం.ఏరోజు కూడా సరైనా సమయానికి సెంటర్లును తెరిచిన దాఖలాలు లేవని,రోజు కేంద్రాలను పనితీరును తనిఖీ చేయాల్సిన సూపర్వైజర్లు దానిని విస్మరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.అంగన్వాడీ కేంద్రాల నుంచి గర్భిణీలకు,నవజాత శిశువులకు, బాలింతలకు అందాల్సిన పోషణ పదార్థాలు క్రమంగా అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మండలంలోని దాదాపు అన్ని సెంటర్లో సమయపాలన పటించడంలేదని విమర్శులు వస్తున్నాయి.పలుచోట్ల ఆయాలే అన్నీ పనులు చూసుకుంటున్నట్లు సమాచారం.అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమయపాలన సక్రమంగా అమలు చేసే బాధ్యత సూపర్వైజర్లుదే,సెంటర్లు పర్యవేక్షణ పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారా, లేదా అనే అంశాన్ని పరిశీలించి నివేదికలు అందించాలి అయితే సూపర్వైజర్లు పనితీరు సరిగా లేదనే విమర్శలు ఉన్నాయి.కొన్ని కేంద్రాల్లో టీచర్లతో సూపర్వైజర్లు కుమ్మక్కైనట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.దీంతో అంగన్వాడీ టీచర్లు విధులకు సరిగా హాజరుకావడం లేదని సమాచారం. పోషణ లోపంతో బాధపడుతున్న చిన్నారులు, బాలింతలు, గర్భిణులను గుర్తించి వారికి పోషణ విలువలు గ ఆహారాన్ని అంది ంచాలనే లక్ష్యంతో సెంటర్లును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహి స్తోంది .క్షేత్రస్థాయిలో ఈ లక్ష్యాలు మాత్రం నీరుగారి పోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తంమవుతున్నాయి.పలు సెంటర్లో ఆయాలే రాజ్యంగా నడుస్తోంది.పలు సెంటర్లో బాలమ్ము తం చిన్నారులకు చేరాల్సి న బాలామ్రు తం పక్కదారులు పడుతోంది. కొన్నిచోట్ల లబ్దిదారులు బాలామృతంపై ఆసక్తి కనబరచకపోవడంతో ఇదే అదనుగా టీచర్లు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతా ధికారులు దృష్టిసారించి ,అంగన్వాడీ కేంద్రాలను గాడిలో పెట్టాల్సి వుందని పలువురు ఆవేదనవ్యక్తం చేశారు.


సమయపాలన పాటించని అంగన్వాడీ సెంటర్లు

## వెలుగు యానిమేటర్ల కు బయోమెట్రిక్ డివైజర్ లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర టౌన్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త.

మడకశిర నియోజకవర్గంలో ఉన్నటువంటి వెలుగు సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న 270 మంది వివోఏ, యానిమేటర్‌లకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, లతో కలిసి కూటమి ప్రభుత్వం నుంచి మంజూరు అయిన బయో మెట్రిక్ డివైస్ లను యానిమేటర్లకు పంపిణీ చేయడం జరిగింది. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సమావేశంలో మాట్లాడుతూ :కూటమి ప్రభుత్వం ఎంతో నమ్మకంగా పంపిణీ చేసిన బయోమెట్రిక్ డివైస్ లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని యానిమేటర్లకు ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వెలుగు అధికారులు జడ్పిటిసి ఉమేష్, నరసింహ మూర్తి, మండల కన్వీనర్లు ఈరన్న, లక్ష్మీ నరసప్ప, కృష్ణమూర్తి, తిప్పేస్వామి, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, కుమార్ స్వామి, గణేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


బయోమెట్రిక్ డివైజర్ లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి - పి జి ఆర్ ఎస్ కు 334 అర్జీలు

అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

జిల్లా లోని సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అర్జీదారులు ఎంతో ఆశతో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమము నకు వస్తారని అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణన్ శర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తోపాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ మలోలా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామకృష్ణారెడ్డి , రామ్మోహన్, మల్లికార్జునుడు, వ్యవసాయశాఖఅధికారి ఉమామహే శ్వరమ్మ హాజరై ప్రజల నుండి 334 దాకా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ నారా యణన్ శర్మ మాట్లాడుతూ. ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీతగడువులోపుతప్పనిసరిగా పరిష్కరిం చాలని ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు మండల స్థాయి అధికారులు ఆయాశాఖ లద్వారాస్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. చాలావరకుకొన్నిమండలాలలో రెవెన్యూ, మునిసిపల్, డి +ఆర్ డి ఏ, వ్యవసాయ శాఖ, డ్వామా తదితర శాఖలలో అర్జీలు పెండింగ్ లో ఉన్నందున వాటిని పారదర్శకంగా పరిష్కార మార్గాల చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అర్జీదారులు పెన్షన్ల మంజూరు, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు మంజూరు, భూ సమస్యల పరిష్కారం తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

## నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని 1వ వార్డు గాంధీనగర్‌కు చెందిన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేయడం జరుగుతోందన్నారు. దీపం పథకం, తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, వంటి పథకాల ద్వారా మహిళలు, రైతులు, పేద కుటుంబాలందరికీ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఇప్పుడు అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు ద్వారా మరింత పారదర్శకతతో, వేగవంతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారుల దాకా చేరుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోము, డిప్యూటి తహశీల్దార్ మల్లేష్, 1వ వార్డుకు చెందిన గోరా, మబ్బాషా, హాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


నూతన స్మార్ట్ రేషన్ కార్డులు అందచేస్తున్న జె.సి

## కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించం

### - గాండ్లపెంట మండలానికి కూడా హంద్రీనీవా నీటిని అందజేస్తాం - ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.1.60 కోట్ల చెక్కుల పంపిణీ - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 15 నెలల కాలంలోనే నియోజకవర్గంలోని లబ్దిదారులకు రూ.1.60 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు లను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే కందికంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలలో నియోజకవర్గంలోని వివిధ మండలాల ప్రజలకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారుకులల పంపిణీ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉంటే జగన్ ఓర్వలేదని, అందుకే కూటమి ప్రభుత్వంపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసిపి పాలనలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్రమాలకు కేరాఫ్‌గా మారారన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వానికి ప్రజావ్యతిరేకంగా మాట్లాడి పోరాటాలు చేసినందుకు తమపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. కేసులకు ఎప్పుడు భయపడలేదని, ర్పజల పక్షాన నిలబడి పోరాటాలు చేశామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై దు ఉరష్ప్రచారం చేస్తే సహించబోమని సమస్యలపై మాట్లాడితే స్వాగతిస్తామన్నారు. కదిరి పట్టణంలో గంజాయి అలవాటు పడి యువత భవిష్యత్తు నాశనం అవుతుందని గంజాయి విక్రయాలపై ఉక్కు పాదం మోపుతామన్నారు.

కదిరి రూరల్ మండలంలోని కౌలేపల్లి వద్ద ఏపిఐ సిసి సర్వే నిర్వహిస్తున్నారని, భూ సేకరణలో పట్టా భూములు తీసుకోమని వీరిపై అక్కడ రైతులు ఎటువంటి అపోహలు నమ్మవద్దని ఎమ్మెల్యే భరోసాని ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా హంద్రీనీవా కాలువ ద్వారా అన్ని చెరువు లకు కృష్ణ జలాలు అందించామని, పులివెందుల సమీపంలోని కొండారెడ్డి చెరువుకు కూడా నీటిని పంపిణీ చేశామన్నారు. త్వరలోనే గాండ్లపెంట మండలానికి కూడా హంద్రీనీవా నీటిని అందిస్తామని ఆ మండల రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వైసిపి నాయకులు అపోహలు సృష్టిస్తూ రైతు పోరు కార్యక్రమాలు చేస్తున్నారని, ఇటువంటి వారికి రైతాంగం, ప్రజలు నమ్మడం లేదన్నారు. కూటమి ప్రభు త్వం ప్రభుత్వ పథకాలు అమలు చేయరని, వైసిపి నాయకులు కలలు కన్నారని, ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంతో కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని ఇటువంటి వాటిని తిప్పికొట్టాలన్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉంటే అమరావతి రాజధానిని అధికారంలో ఉంటే మూడు రాజధానులు అంటూ ప్రకటనలు చేశారని, జగన్ అధికారం పోయి లిక్కర్ కుంభకోణంలో ఇరుక్కుపోవడంతో అమరావతి రాజధానిని తాము వ్యతిరేకించలేదని సజ్జలతో చెప్పించారన్నారు. అపద్దాలు చెప్పడంలో వైసిపి నాయకులు దిట్ట అన్నారు. అప్పటి ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాలలకు పిల్లర్లు వేసి వదిలేశారని, మొండిగోడలకు పరిమితమైన మెడికల్ కళాశాలలు మాజీ మంత్రి ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్‌కు కనపడలేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాము అభివృద్ధి గురించి మాట్లాడుతాము తప్పా అపద్దాలు చెప్పడం తమకు రాదన్నారు. కదిరిలో వైసిపి నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించడం దొంగ పట్టాలు సృష్టించడం, విక్రయించడం తమకు తెలియదన్నారు. నిజాయితీగా ప్రజా సమస్యలపై తాము మాట్లాడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు రాజశేఖర్‌బాబు, రాజేంద్ర నాయుడులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

## సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

ప్రకృతి పరంగా లభించే సూర్య రశ్మి వినియోగించుకొని, విద్యుత్ బిల్లులను తగ్గించుకొని ఆదాయం పొందాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్‌లు పేర్కొ న్నారు. స్థానిక సితార ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉచిత విద్యుత్ పథకం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పిస్తోందన్నారు. ఒక కిలోవాటు 30,000, గరిష్టంగా ఐదు కిలోవాట్లకు 78 వేల రూపాయలు సబ్సిడీ కింద వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగ పరుచుకున్న పక్షంలో ఉచితంగా విద్యుత్తును పొందవచ్చునని, అదేవిధంగా మిగులు విద్యుత్తుకు ఆదాయం వుంటుందన్నారు. నేటి ఆర్థిక పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవాలని వారు సూచించారు. ఉచితంగానే విద్యుత్తు పొందే దుకు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో ఏడిఇ సాయిశంకర్, ఈ పథకం అమలు పట్ల అవగాహన కల్పి ంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జబ్బా ర్మి యా, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, ఏఇ మధు, డిప్యూటి తహశీల్దార్ సూర్యనారా యణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, ఆర్ఎస్ రాజా, మోడల్ స్కూల్ చైర్మన్ పవన్‌కు మార్‌యాదవ్, కూటమి సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతున్న దృశ్యం

## స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్

### - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల వినియోగదారుల సౌకర్యార్థం నూతనంగా స్మార్ట్ రేషన్ కార్డులను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక సితార ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన రేషన్‌కార్డు వినియోగదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్‌లు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 24,910 మంది రేషన్‌కార్డ్ వినియోగదారులు వున్నారన్నారు. వీరికి అందిస్తున్న నూతన కార్డుల ద్వారా, వారు రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ పొందడానికి సౌకర్యం వుందని వారు తెలిపారు. గతంలో ప్రభుత్వ అధినేతల ఫొటోలతో పాటు ప్రచారం చేసుకునే వారిని, ప్రస్తుతం రాష్ట్ర అధికార చిహ్నంతో మాత్రమే ఈ కార్డులను అందిస్తున్నామని వారు స్పష్టం చేశారు. పేదల సంక్షే మమే తమ ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో తహశీల్దార్ పుణ్యవతి ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, డిప్యూటి తహశీల్దార్ సూర్యనారా యణ, సిఎస్‌డిటి ప్రవీణ్‌కుమార్, మార్కె ట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరు వు ప్రతా ప్, పార్టీ కన్వీనర్ ఎంకె చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు, చికెన్ శీనాతో పాటుగా కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేస్తున్న దృశ్యం

## మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికి రోల్ మోడల్

### పార్లమెంటరీ జాతీయ సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త

మహిళా సాధికారత లో ఆంధ్రప్రదేశ్ లో కొనసాగుతున్న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దేశంలోనే రాష్ట్రం ఎంతో ముందంజలో ఉందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల తొలి జాతీయ సదస్సులో సోమవారం ముగింపు సదస్సులో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మె ల్యే పల్లె సింధూర రెడ్డి మీడియాతో మాట్లాడారు. మహిళా సాధికా రతలో రాజకీయ, ఆర్థిక, సామాజిక,విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికి రోల్ మోడల్‌గా ముఖ్యమంత్రి నిలుపుతారని విశ్వాసం నమ్మకం తమకు ఉందని ఎమ్మెల్యే అన్నారు. మహిళల సాధికారత కోసం స్థిరమైన ఆర్థిక సాధికారత ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఈ సభలోని తీర్మానాలు చరిత్రలలో మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు. అనంతరం పలు రాష్ట్రాల మహిళా ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ రాష్ట్రాల్లో మహిళలకు అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.


సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

## అనుమాన స్పదంగా రామకృష్ణనాయక్ మృతి

### - పోలీసులు కొట్టడంతోనే మృతి చెందాడంటున్న బంధువులు - మృతదేహంతో పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన - గుండెపోటుతోనే మృతి చెందాడని డాక్టర్లు తెలిపినట్లు సిఐ కౌలుట్లయ్య వివరణ

శింగనమల, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండా గ్రామానికి చెందిన రామకృష్ణ నాయక్(38)సోమవారం మండల కేంద్రంలోని ఆసుపత్రిలో అనుమాన స్పదంగా మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు. . ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు కొందరు పేకాట ఆడుతున్నారన్న నెపంతో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, సోమవారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని తెలిపినట్లు వారు తెలిపారు. దీంతో మరుసటిరోజు ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినట్లు బంధువులు తెలిపారు. అనంతరం రామకృష్ణ తీవ్ర అశ్వస్థతకు గురయ్యారని, ఆసుపత్రిలో చేర్పించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు చెబుతున్నారని బంధువులు తెలిపా రు. అయితే ఈ విషయం తెలుసుకున్న బంధువులు పోలీ సులే కొట్టి ఉండట ంతో అశ్వస్థతగు కుర్తై మృతి చెంది ఉంటారని బంధువులు తెలుపుతున్నారు. దీంతో బంధులు అంతా కలిసి మృతుడిని స్ట్రెచ్చర్‌పై ఉంచి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో సిఐ మాట్లాడుతూ..నాగలగుడ్డం తాండాలో ఆదివారం పేకాట ఆడుతున్నవా రిపై దాడులు చేసిన మాట వాస్తవం అని, అయితే చీకటి కావడంతో సోమవారం ఉదయం స్టేషన్ వద్దకు హాజరు కావాలని నలుగురికి చెప్పి పోలీసులు వెనక్కి వచ్చారన్నారు. సోమవారం తామంతా కలెక్టరేట్ వద్ద ఆర్డిటి సంస్థను బతికించాలని ప్రజలు ధర్నా చేస్తుంటే తామంతా అక్కడే విధుల్లో ఉన్నామన్నారు. మధ్యాహ్నం ఫోన్ చేసి రామకృష్ణ గుండెపోటుతో మృతి చెందాడని సమాచారం వచ్చిం దన్నారు. అయితే సదరు వ్యక్తిని పోలీసులు ఎక్కడా బెదిరింపులకు గురి చేయలేదని తెలిపారు. గుండెపోటుతో మరణించాడని శింగనమల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు తనకు తెలియజే సినట్లు ఆయన తెలిపారు. స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తు న్న బంధువులతో సిఐ కౌలుట్ల య్య, టిడిపి నాయకులు మృతుడు రామకృష్ణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఇతనికి భార్య ఇంద్రజ, కుతుర్లు ఎనన్యకృష్ణ (4 సంవత్స రాలు), కీర్తి కృష్ణ (2 సంవత్స రాలు), కుమారులు అన్యకృష్ణ (3 నెలలు) ఉన్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.


రామకృష్ణ భౌతిక కాయం


స్ట్రెచ్చర్‌పై మృతదేహాన్ని ర్యాలీగా తీసుకొస్తున్న బంధువులు